
సాక్షి అనకాపల్లి

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



న్యూస్‌రీల్

శరన్నవరాత్రులు ప్రారంభం



నూకాంబిక అమ్మవారి ఆలయంలో కలశ పూజ చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొలువులో శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కలెక్టర్ విజయ కృష్ణన్ ఉత్సవాలను ప్రారంభించి, ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, రక్షా సూత్రధారణ, అఖండ దీపస్థాపనం, నవదుర్గా పీఠ స్థాపన, కలశ స్థాపన, అగ్నిప్రతిష్ట, హోమాలు, పతాక ప్రతిష్ట, నీరాజన మంత్ర పుష్పాలు, కలశ స్థాపన వంటి అనేక కార్యక్రమంలు నిర్వహించారు. మొదటి రోజు మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద దాడి ఆదిశివ నూకరాజు, కాంత్రేగుల యోగవినోద్ కుమార్ ఆర్థిక సహాయంతో వెయ్యి మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గొడుగులతో క్వారీ బాధితుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న క్వారీ బాధితులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం జి.కోడూరు క్వారీ బాధితులు మండుటెండలో గొడుగులు వేసుకుని ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. బీఎస్పీ నాయకుడు బి.నాగరాజు, సీపీఎం నాయకుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ క్వారీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బాధితులు 60 రోజులుగా నిరాహారదీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోగా, దీక్షా శిబిరం టెంట్‌ను తొలగించటం అన్యాయమన్నారు. అధికారులు ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. అధికారులకు దళితుల ఆవేదన కానరాలేదన్నారు. అధికారుల తప్పిదం ఉండటం వల్ల దొంగచాటుగా టెంట్ తొలగించారని మండిపడ్డారు. అధికారులు ఎన్ని కవ్వింపు చర్యలకు పాల్పడినా ఉద్యమం ఆగదన్నారు.

సైబర్ వల.. చిక్కితే విలవిల..!



- ఖాతాల నుంచి క్షణాల్లో మాయమవుతున్న డబ్బులు
- జిల్లాలో ఏడాది కాలంలో 94 సైబర్ కేసులు నమోదు
- ఇప్పటివరకు రూ. 94 లక్షలు ఫ్రీజ్
- అచ్యుతాపురం కేంద్రంగా నకిలీ కాల్ సెంటర్
- డిజిటల్ అరెస్ట్ చేస్తామని భయపెట్టి కోట్లలో దోపిడీ
- అప్రమత్తతే ఆయుధమంటున్న పోలీసులు

సాక్షి, అనకాపల్లి:

ఇలా ఒకరిద్దరు కాదు చాలామంది సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోతున్నారు. అవగాహన లేకపోవడంతో కొందరు, అవగాహన ఉండి నిర్లక్ష్యంతో మరికొందరు నష్టపోతున్నారు. పార్ట్‌టైం, ఫుల్‌టైం ఉద్యోగాలు, వర్క్ ఫ్రమ్ హోం అంటూ ఆన్‌లైన్‌లో ఫేక్ లింక్‌లు పెట్టి వాటిని క్లిక్ చేసేలా ఆశ చూపించి మోసం చేస్తారు. ఎక్కువగా ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు కల్పిస్తామంటూ యువతను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారు. ఫేక్ యాప్‌లు, ఫేక్ లింక్‌ల ద్వారా డేటాని తస్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలపై జిల్లా వ్యాప్తంగా పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో మోసం...



అనకాపల్లిలో గవరపాలేనికి చెందిన మణికంఠ అమెజాన్‌లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేశాడు. ఈ ఏడాది జనవరి 31న వాట్సాప్‌లో కంపెనీ పేరుతో ఒక లింక్ వచ్చింది. ఇది పార్ట్‌టైమ్ ఉద్యోగమని.. ఇంటిలో కూర్చునే డబ్బు సంపాదించుకోవచ్చని చెప్పడంతో రిజిస్ట్రేషన్ కోసం రూ.1,000లు ఫోన్‌పే చేశాడు. కొద్ది రోజుల్లోనే మణికంఠ ఖాతాలో రూ.1,400 జమ అయ్యాయి. దీంతో పార్ట్‌టైమ్ ఉద్యోగం బావుందని నమ్మిన ఆ యువకుడు నిర్వాహకులు చెప్పిన విధంగా దపదఫాలుగా రూ.1.80 లక్షలు పంపించాడు. తర్వాత అటునుంచి ఒక్క రూపాయి రాలేదు. దీంతో మోసపోయానని గమనించి ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే స్పందించి మణికంఠ ఖాతా నుంచి వెళ్లిన డబ్బులో రూ.1.20 లక్షలు ఫ్రీజ్ చేశారు.

అచ్యుతాపురం కేంద్రంగా సైబర్‌డెన్...



అచ్యుతాపురంలో సైబర్ నేరగాళ్ల అరెస్ట్ (ఫైల్)

అచ్యుతాపురంలో ఒక అపార్ట్‌మెంట్‌లో సైబర్ డెన్‌ను ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేస్తున్న 33 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ కాల్ సెంటర్‌ను నడుపుతూ ప్రజల వ్యక్తిగత బ్యాంక్ వివరాలు మోసపూరితంగా సేకరించి, ఖాతాల్లోని డబ్బులను మాయం చేసే ముఠాను పోలీసులు పట్టుకున్నారు. స్వదేశంలోనే కాకుండా విదేశాల్లో ఉన్నవారిని కూడా టార్గెట్ చేసే ఆ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులను సీఐడీకి అప్పగించారు.

సురక్షితమైన డిజిటల్ లావాదేవీలు...

- బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్, యూపీఐ పిన్, ఓటీపీ, ఏటీఎం, డెబిట్‌కార్డు, క్రెడిట్‌కార్డు వివరాలు ఎవరితోనూ పంచుకోకపోవడమే మంచిది.
- డిజిటల్ లావాదేవీలకు బార్‌కోడ్‌లు, క్యూఆర్ కోడ్‌లు స్కానింగ్ లేదా ఎంపిన్ లేకుండా ఉన్నవే ఎంచుకోవాలి.
- ఏదైనా ఫోన్‌కాల్, ఈ-మెయిల్ చేసి మీ కేవైసీ అప్డేట్ చేయాలని వివరాలు అడిగినా చెప్పరాదు. ఒకవేళ అలాంటి అనుమానాలుంటే బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా చెక్ చేసుకోవాలి. హోం బ్యాంక్ శాఖను సంప్రదించాలి.
- ఈమెయిళ్లు, ఎస్ఎంఎస్‌లలో యూఆర్ఎల్, డొమైన్ పేర్లను స్పెల్లింగ్ లోపాలుంటే జాగ్రత్తగా తనిఖీ చేయండి. ఆన్‌లైన్ బ్యాంకింగ్ కోసం అధికార వెబ్‌సైట్‌లనే ఉపయోగించాలి.
- ఏదైనా వెబ్‌సైట్, అప్లికేషన్‌లో మీ ఈమెయిల్‌ను యూజర్ ఐడీగా నమోదు చేస్తున్నప్పుడు మీ ఈ-మెయిల్ పాస్‌వర్డ్‌ను 'పాస్‌వర్డ్' అని పెట్టుకోవద్దు.

ఆన్‌లైన్ లింక్‌లు క్లిక్ చేయవద్దు..

బ్యాంకుల నుంచి వ్యక్తిగత వివరాలు ఎప్పుడూ అడగరు. అలా అడిగితే అది సైబర్ నేరగాళ్ల పనే. ఆన్‌లైన్ లింక్‌లు వస్తే వాటిని క్లిక్ చేయొద్దు. ఒకవేళ క్లిక్ చేస్తే వెంటనే మీ మొబైల్‌కి ఓటీపీ వస్తుంది. దానికి ఎట్టి పరిస్థితుల్లో ఎంటర్ చేయొద్దు. ఒకవేళ చేశారంటే మీ బ్యాంక్ ఖాతా వివరాలు సైబర్ నేరగాళ్లకు చేరినట్టే. ఫేస్‌బుక్కుల్లో కూడా అందమైన అమ్మాయిల పేరిట హానీ ట్రాప్, లింక్‌లు పెట్టి మోసం చేస్తారు. అలా జరిగితే వెంటనే సైబర్ పోలీసులకు తెలియజేయాలి.

– సత్యనారాయణ, లీడ్ బ్యాంక్ మేనేజర్

నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ వలలో పడొద్దు



సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేస్తే బ్యాంక్ ఖాతాల్లో నగదు ఫ్రీజ్ చేస్తాం. అలా ఫ్రీజ్ చేసిన సొమ్మును అనేక కేసుల్లో బాధితులకు ఇప్పటికే అప్ప గించాం. పండగల సమయాల్లో నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌ల ద్వారా ఆఫర్‌లు ఇస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటారు. వాటి విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలి.

– తుహిన్ సిన్హా, ఎస్పీ

డిజిటల్ అరెస్ట్ చేస్తామంటూ భయపెట్టారు..

నర్సీపట్నానికి చెందిన ఒక వృద్ధుడు సైబర్ మోసానికి గురయ్యారు. ముంబై పోలీసులమంటూ ఫోన్ చేసి.. మీ బ్యాంక్ ఖాతాలో అనాథరైజ్డ్‌గా రూ.2 కోట్ల వరకు నగదు బదిలీ అయిందని, తక్షణమే రిటర్న్ కొట్టకపోతే అరెస్ట్ చేస్తామంటూ బెదిరించారు. తక్షణమే బ్యాంక్ ఖాతా వివరాలన్నీ చెప్పండి చెక్ చేస్తాం.. లేదంటే మిమ్మల్ని అరెస్ట్ చేయాల్సి ఉంటుందంటూ బెదిరించారు. వారి మాటలకు భయపడి బ్యాంక్ ఖాతా వివరాలు చెప్పడంతో రూ.కోటి 43 లక్షల వరకు తస్కరించారు. దీంతో ఆ వృద్ధుడు అప్రమత్తమై సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే సైబర్ నేరగాళ్ల బ్యాంక్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి, బాధితుడు పోగొట్టుకున్న నగదును రికవరీ చేశారు.

జిల్లాలో గత ఆరేళ్లుగా సైబర్ కేసుల వివరాలు

- 2021లో 128
- 2022లో 217
- 2023లో 310
- 2024 జూన్ వరకు 201
- 2024 జూన్ నుంచి నేటి వరకు 94 కేసులు

94 కేసుల్లో రూ.93.74 లక్షలు ఫ్రీజ్

జిల్లాలో జూలై 1 నుంచి నేటి వరకు 94 సైబర్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఇప్పటివరకు రూ.93,78,304 మొత్తాన్ని ఫ్రీజ్ చేశారు. అలాగే రూ.15,45,234 మొత్తాన్ని 17 కేసుల్లో బాధితులకు తిరిగి చెల్లించారు.

అభివృద్ధి పేరిట భూదందా

- రూ.100 కోట్ల దోపిడీకి టీడీపీ నేతల స్కెచ్
- 406 ఎకరాల్లో అనర్హుల పేర్లు చేర్చి జాబితా సిద్ధం
- మరో 400 ఎకరాల భూమి కాజేసేందుకు సన్నాహాలు
- డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారి అండదండలు
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆరోపణ



మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: బినామీ పేర్లతో టీడీపీ నాయకులు రూ.100 కోట్ల దోపిడీకి తెరలేపారని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. మండలంలోని రాచపల్లి రెవెన్యూలో గల 737 సర్వే నంబర్‌లో 1604 ఎకరాల భూమి ఉంది. ఈ భూముల్లో 406 ఎకరాల ప్రభుత్వ భూములను పరిశ్రమలకు అప్పగించేందుకు ఇటీవల సాగుదారుల వివరాల కోసం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ఈ భూముల్లో అధికారులు గుర్తించిన సాగుదారుల వివరాలతోపాటు పలు ఇతర విషయాలపై మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ సోమవారం తహసీల్దార్ బి.వెంకటరమణకు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేశారు. అనంతరం మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. పరిశ్రమలు వస్తున్నాయంటూ ఇప్పటికే 406 ఎకరాల్లో సర్వే చేశారని, ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం అభినందనీయన్నారు. అయితే సాగుదారుల జాబితాలో బినామీలను చేర్చి పరిహారం కాజేసేందుకు చూస్తున్నారన్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన 406 ఎకరాల్లో అర్హులు కాకుండా అనర్హుల పేర్లు చేర్చారని, ఇటీవల బీజేపీ నేత రాంబాబు యరకన్నపాలెం వచ్చిన కలెక్టర్ విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. సర్వేను మండలస్థాయి అధికారులు లేకుండా ఒక సచివాలయ సర్వేయర్‌తోనే చేయించారన్నారు.

సాగుదారులు కాకపోయినా కోర్టుకెళ్లారు..

సర్వే నంబర్ 737లో ఉన్న 406 ఎకరాల భూమిని ఆనుకొని మరో 500 ఎకరాలు ఉండగా, అందులో సుమారు 100 ఎకరాలు రైతుల సాగులో ఉన్నాయన్నారు. మిగిలిన 400 ఎకరాలపై టీడీపీ నేతలు కన్నేశారని, వారి ప్రోద్బలంతో కొందరు స్థానికులు, సమీప పంచాయతీలకు చెందిన వారు మొత్తం 115 మంది.. ఆ భూములను తాము సాగు చేస్తున్నట్టు కోర్టును ఆశ్రయించారన్నారు. ఈ భూములకు సంబంధించి మండలంలోని ఇద్దరు ముగ్గురు టీడీపీ నేతలతోపాటు ఒక నియోజకవర్గ టీడీపీ నేత, డివిజన్‌స్థాయి రెవెన్యూ అధికారి ప్రోద్బలంతో భారీ కుంభకోణానికి సన్నాహాలు చేస్తున్నట్టు ఆరోపించారు. ఈ 400 ఎకరాల్లో ఎవరు ఎన్ని ఎకరాలు దోచుకుంటున్నదీ త్వరలో పేర్లతో సహా వెల్లడిస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ భూములు దోపిడీకి గురి కాకుండా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, ఎంపీపీ సర్వేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, నేతలు వాసు, భద్రాచలం, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో చెరువుకు గండి

- బుచ్చెయ్యపేట మండలంలో అవస్థలు
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

బుచ్చెయ్యపేట మండలంలో సోమవారం ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు పడ్డాయి. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బురదలో వాహనాలు కూరుకుపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చెరువులకు గండి పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

IIలో



సమస్యలు తీర్చకపోతే సమ్మె తప్పదు

డీఎంహెచ్‌వోకు పీహెచ్‌సీ వైద్యుల నోటీసు

అనకాపల్లి: ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో డీఎంఅండ్‌హెచ్‌వో హైమావతికి సోమవారం సమ్మెకు సిద్ధమంటూ నోటీసును అసోసియేషన్ సభ్యులు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షురాలు ఎస్తేర్ రాణి, కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ ఇన్-సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైమ్-బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలని, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ.5 వేల అలవెన్స్ ఇవ్వాలని, నేటివిటీ-అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యలు పరిష్కరించాలని, పీహెచ్‌సీలో వైద్యులకు కచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవు ఇవ్వాలని, వైద్యుల జాబ్ చార్ట్, విషపూరితమైన పని వాతావరణాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, పీహెచ్‌సీలో జనాభాకు తగ్గట్టుగా సిబ్బందిని నియమించాలని డిమాండ్లతో సమ్మె నోటీసును అందజేశారు. ఐదు రోజులు పాటు నల్ల బ్యాడ్జీలతో నిరసన నిరసన తెలియజేస్తూ, అప్పటికీ సమస్యలు పరిష్కరించని ఎడల సమ్మె చేయడం జరుగుతుందన్నారు. గత ఏడాది సమ్మె చేస్తున్న సమయంలో ప్రభుత్వం చర్చలకు పిలిపించి, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఏడాది పూర్తి అవుతున్నా నేటికీ పరిష్కరించకపోవడంతో మారోసారి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు.



డీఎంఅండ్‌హెచ్‌వో హైమావతికి వినతిపత్రం అందజేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

కిరండూల్ పాసింజర్‌కు అదనపు కోచ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం పాసింజర్‌కు అదనపు కోచ్‌ను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్ (58501) పాసింజర్‌కు ఈ నెల 23వ తేదీ నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు, కిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్‌కు ఈ నెల 24వ తేదీ నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు ఒక జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

భారీ గణపతికి ఘనంగా వీడ్కోలు



ఫైర్ ఇంజన్ సహాయంతో 126 అడుగుల వినాయక విగ్రహం నిమజ్జనం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సంపంత్ వినాయక కమిటీ ఏర్పాటు చేసిన 126 అడుగుల వినాయక విగ్రహం అనుపు కార్యక్రమం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. నెల రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడు సోమవారం ప్రత్యేక పూజలందుకున్నారు. భారీ విగ్రహం కావడంతో నిలిపినచోటే నిమజ్జనం చేశారు.

ఫైర్ ఇంజిన్‌తో సుమారు గంటపాటు నీళ్లను పంపింగ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. గణేశుని నిమజ్జనాన్ని జనం పెద్దసంఖ్యలో ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బుద్ధ భూలోక నాయుడు, బుద్ధ భాను ప్రకాష్, సినీ డైరెక్టర్ ఆడారి సాయి మూర్తి, మళ్ళ రాము, మద్దాల భాను తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె..

ఉపమాకలో నేడు అంకురార్పణ • భారీ ఏర్పాట్లు చేస్తున్న టీటీడీ



స్వామివారి ఉత్సవమూర్తులు



బేడా మండపం చుట్టూ భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పందిళ్లు

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. ఉపమాకలో గరుడాద్రిపై కల్కి అవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన స్వామివారికి తిరుపతిలో మాదిరిగానే ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 23 నుంచి అక్టోబర్ 2 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో తిరుమల వెళ్లలేని వారు ఉపమాక వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. 23న ఉదయం స్వామివారి ఉత్సవ కావిడను ఉపమాక పురవీధుల్లో ఊరేగిస్తారు. ఈ సమయంలో భక్తులు పసుపు కుంకుమలు, కొబ్బరి బొండాలు సమర్పించుకుంటారు. స్వామివారి ఉత్సవాలకు ఆహ్వానంగా ఈ ఉత్సవ కావిడను ఊరేగిస్తామని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. విష్వక్సేనులవారిని పల్లకిలో ఉంచి మత్స్యంగ్రహణం, పుట్టమన్ను తెచ్చే కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి అశ్వవాహనంపై స్వామివారి తిరువీధి సేవ జరుగుతుంది.

రోజుకో వాహనంపై తిరువీధి సేవ

బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని రోజుకో వాహనంలో ఊరేగిస్తారు. 24వ తేదీ బుధవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుంది. రాత్రికి శేషతల్ప వాహనంపై స్వామివారి తిరువీధి సేవ నిర్వహిస్తారు. 25న హంసవాహనంపై, 26న ఇత్తడి సప్పర వాహనంపై, రాత్రి పెద్దపల్లకిలో, 27న ఆంజనేయ, లక్క గరుడ వాహనాలపై, 28న సప్పర, రాజాధిరాజ వాహనాలపై తిరువీధి సేవ నిర్వహిస్తారు. 29న వసంతోత్సవం జరుగుతుంది. 30న పుణ్యకోటి వాహనంపై తిరువీధి సేవలు నిర్వహిస్తారు. అక్టోబరు 1న మృగవేట కార్యక్రమం జరుగుతుంది, సాయంత్రం గజవాహనంలో స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి బంధుర సరస్సు వద్దకు తీసుకువస్తారు. ఉత్సవమూర్తులకు ధనుర్బాణాలకు పూజలు చేసిన తర్వాత గజవాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు.

అక్టోబర్ 2న విజయదశమిని పురస్కరించుకుని ఆలయంలో నిత్యసేవాకాలం, హోమాలు నిర్వహిస్తారు. ఉదయం వినోదోత్సవం, సాయంత్రం శమీపూజ జరుగుతుంది. చివరిగా ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నాళాయిర సేవాకాలం, ద్వాదశ తిరువారాధన, నిత్యసేవాకాలం, ప్రసాద నివేదనలు మంత్రపుష్పాలు, తీర్థగోష్ఠి నిర్వహిస్తారు. పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

క్లుప్తంగా

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



కాకినాడ ఆస్పత్రిలో మృతి చెందిన రాజేష్

పాయకరావుపేట: మండలంలో సత్యవరం గ్రామానికి చెందిన ముయ్యా రాజేష్ (25) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా, సోమవారం కాకినాడలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ జి.అప్పన్న వివరాల ప్రకారం... ఎనిమిది నెలలు క్రితం మృతుడు రాజేష్ తన భార్యతో కుటుంబ ఖర్చుల విషయమై తగాదాపడ్డాడు. అప్పట్లో ఆమె ప్రత్తిపాడులో తన పుట్టింటికి వెళ్లిపోయింది. అక్కడ పోలీసు స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ అక్కడకు రాజేష్‌ను అతడి తల్లిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నెల 5న భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. దాంతో ఈ నెల 9న తన భార్యను సత్యవరం తీసుకెళ్లేందుకు రాజేష్ అంగీకరించాడు. ఇంతలో ఈ నెల 6న అతడు మనస్తాపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. తొలుత తుని ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాకినాడలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 5 గంటలకు మృతి చెందాడు. మృతుడు రాజేష్ తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చోరీ కేసుల్లో అయిదుగురి అరెస్టు



చోరీకి పాల్పడిన వ్యక్తులతో ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: మండలంలోని రెండు చోరీలకు పాల్పడిన అయిదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రసాదరావు సోమవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలో మూడు రోజుల క్రితం నాగులాపల్లిలో చల్లా వెంకయ్యకు చెందిన ట్రాక్టర్ రిమ్ములు, బెల్ హౌసింగ్‌తోపాటు చిన్న యోక్, ఆటోను నలుగురు వ్యక్తులు ఎత్తుకుపోయారు. దీంతో వెంకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మునగపాకలో వ్యవసాయ పొలాల వద్ద క్రషర్ల పనిముట్లు, పాత కత్తులు, గునపాలు, రాడ్స్, నిపుల్ స్టిక్స్, 295 కిలోల ఇనుము చోరీకి గురయ్యాయంటూ రైతు పెంటకోట రామ నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆయా కేసుల విచారణలో భాగంగా అయిదుగురిని అరెస్టు రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థులపై కర్కశం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు

- కలెక్టరేట్‌ను ముట్టడించిన ఏయూ విద్యార్థులు
- ప్రభుత్వానికి నిరసన సెగ.. అడ్డుకున్న పోలీసులు
- విద్యార్థుల ఛాతీపై పిడిగుద్దులు.. విద్యార్థినికి గాయం
- 26 మంది ఎస్ఎఫ్ఐ నేతల అరెస్టులతో ఉద్రిక్తత

మహారాణిపేట/మద్దిలపాలెం: వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వ విద్యాలయంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోరుతూ విద్యార్థులు కదం తొక్కారు. భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం 'చలో కలెక్టరేట్'కార్యక్రమం చేపట్టారు. ఏయూ ప్రధాన ద్వారం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు వందలాది మంది విద్యార్థులు భారీ ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

నిరసన..ఘర్షణ..అరెస్టులు..

ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్న ఏయూ విద్యార్థులు, రోడ్డుపై బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ర్యాలీకి, ధర్నాకు అనుమతులు లేవని, వెంటనే ఖాళీ చేయాలని పోలీసులు మైక్‌ల్లో హెచ్చరించినా విద్యార్థులు మధ్యాహ్నం 2 గంటల వరకు ఆందోళన కొనసాగించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం, స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు కలిపి మొత్తం 26 మందిని అరెస్టు చేసి మహారాణిపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఏసీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వంపై నేతల ఆగ్రహం

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడాన్ని ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజు బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులపై భారం మోపుతోందని విమర్శించారు. ఏయూను గీతం ప్రైవేట్ యూనివర్సిటీకి దాసోహం చేస్తూ 46 పీజీ కోర్సులను ఎత్తివేశారని ఆయన మండిపడ్డారు. ఏయూ కమిటీ కన్వీనర్ డి.వెంకటరమణ మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే మంత్రులు, ఎమ్మెల్యేలను వర్సిటీలో అడుగుపెట్టనివ్వమని, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కూటమి నేతలు ఏయూను తమ రాజకీయాలకు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు.





విద్యార్థులను వ్యానుల్లో ఎక్కిస్తున్న పోలీసులు

అరెస్టులను ఖండించిన పరిరక్షణ కమిటీ

విద్యార్థుల అరెస్టులను ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఇది ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. అరెస్టుల సమయంలో పొన్నాడ ప్రగతి అనే ఇంజినీరింగ్ విద్యార్థిని తీవ్రంగా గాయపడి కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఛాతీపై పిడిగుద్దులతో దాడి చేయడాన్ని, 26 మంది నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఖండించింది. ఆందోళనలో ఎస్ఎఫ్ఐ ఏయూ అధ్యక్షురాలు ఎం.కుసుమాంజలి, జిల్లా నాయకులు పి.సాయి తేజ, ఎం.నరేష్ ఎం.శశి కుమార్, ఆర్.నిఖిల్, పి.ప్రగతి, వినీల, మౌనిక, బి.భరత్, విద్యార్థులు తరుణ్, సునీల్, సోమేష్, సంజయ్, కౌశల్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల వద్ద అప్రమత్తం

కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఈవీఎం గోదాము రక్షణ, భద్రత పట్ల సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులకు ఆదేశించారు. ఈవీఎం గోదాము నెలవారీ తనిఖీలో భాగంగా ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోదాములను సోమవారం ఆమెతో పాటు పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించారు. గోదాముల వద్ద భద్రతా పరిస్థితులను, సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి అమర్చిన సీళ్లను తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, లాంగ్ బుక్ నిర్వహణ, ఇతర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. అనంతరం విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే చెప్పండి

ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో సమస్యలు, పొరపాట్లు వంటి అభ్యంతరాలపై రాజకీయ పార్టీల నేతలు తమ దృష్టికి తీసుకురావాలని డీఆర్వో వై సత్యనారాయణ రావు సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో మాసాంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్లను చేర్చడాన్ని దృష్టిలో ఉంచుకుని, 1,150 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో కొత్త భవనాలను గుర్తించాలన్నారు. బీఎల్వోలు సమన్వయంతో సంబంధిత పోలింగ్ స్టేషన్లను ధ్రువీకరించాలన్నారు. ఓటర్ల జాబితాలో ఏవైనా వ్యత్యాసాలు ఉంటే ఈఆర్వో దృష్టికి తీసుకురావాలని బీఎల్వోలను ఆదేశించాలని పార్టీల నేతలు అభ్యర్థించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బి. శ్రీనివాసరావు, రమేష్, కె.హరినాథబాబు, సూరిబాబు, ఉమామహేశ్వరరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే క్రిమినల్ కేసులు

డీఎంహెచ్‌వో హైమావతి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

తుమ్మపాల: గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు వంటి పరీక్షలకు వినియోగించే యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.హైమావతి హెచ్చరించారు. మాతా శిశు మరణాలు, పీసీపీఎన్‌డీటీ జిల్లా కమిటీ సమావేశం సోమవారం జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన చట్టాన్ని పక్కాగా అమలు చేస్తామన్నారు. అధికారులకు స్కానింగ్ సెంటర్లను విధిగా తనిఖీలు చేయాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 31వ తేదీ వరకు జరిగిన మాతా శిశు మరణాలు, ఏడాది నుంచి ఐదేళ్లలోపు పిల్లల మరణాలపై సమీక్షించామన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, కమిటీ సభ్యులు, ప్రైవేట్ వైద్యులు పాల్గొన్నారు.

జారిపడిన తూము షట్టర్



రైవాడ ఎడమ కాలువ ప్రధాన తూము వద్ద షట్టర్‌కు మరమ్మతులు

దేవరాపల్లి: రైవాడ జలాశయం ఎడమ కాలువ ప్రధాన తూము షట్టర్ల మరమ్మతులు చేస్తుండగా సోమవారం ఒక ఇనుప షట్టర్ కిందికి జారి పడిపోయింది. దీంతో ఈ కాలువ ద్వారా ఆయకట్టుకు సాగునీటితో పాటు జీవీఎంసీ ప్రజలకు తాగునీటి సరఫరాకు తాత్కాలికంగా ఆటంకం ఏర్పడింది. ఈ షట్టర్‌ను ఇంటెక్ చాంబర్ లోపల నుంచి ఇనుప గొలుసుల సహకారంతో బయటకు తీస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో నీటిలో పడిపోయింది. ఈ షట్టర్ ఎడమ చాంబర్ మదుంకు అడ్డంగా ఉండిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న జలాశయం డీఈఈ జి. సత్యంనాయుడు అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని అప్రమత్తం చేశారు. రెండు షట్టర్లలో ఒక షట్టర్ మరమ్మతులు పూర్తయిన తర్వాత రెండవ షట్టర్ మరమ్మతులు చేపట్టనున్నారు. మదుంకు అడ్డంగా ఉండిపోయిన షట్టర్‌ను తీయించి తాగు, సాగు నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చేస్తామని డీఈఈ సత్యంనాయుడు స్పష్టం చేశారు.

అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

- క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌కు 241 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

తుమ్మపాల: అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆమెతోపాటు జేసీ ఎం. జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల అర్జీల గురించి వెంటనే సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీల స్థితిగతులపై అర్జీదారులు టోల్ ఫ్రీ నంబరు 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఈ వారం మొత్తం 241 అర్జీలు నమోదు కాగా, వాటిలో అత్యధికంగా 117 రెవెన్యూ శాఖకు సంబంధించి వివిధ రకాల భూసమస్యలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలి...

పూర్వకాలం నుంచి సాగులో ఉంటున్న తమ భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరుతూ మాడుగుల మండలం చింతలూరు, గడబూరు గ్రామాల రైతులు కలెక్టర్‌ను వేడుకున్నారు. బీడు భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న తమకు పంట నష్టం జరిగితే అధికారులు ఎటువంటి ప్రతిఫలం అందించలేకపోతున్నారని వాపోయారు. భూములకు సర్వే చేపట్టి సాగు ఆధారంగా తమ పేర్లతో పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని, ఆన్‌లైన్లో నమోదు చేయడం ద్వారా సంక్షేమ పథకాలు పొందగలమని కోరారు. అన్నదాత సుఖీభవ, ఈ -పంట, విత్తనాలు, ఎరువులు, తదితర పథకాలు అందడం లేదని వాపోయారు. 50 మందికి పైగా రైతులు అర్జీలు సమర్పించి తమ గోడును పీజీఆర్ఎస్‌లో వినిపించుకున్నారు.

ఎలక్ట్రికల్ వాహనం మంజూరు చేయండి



అంగవైకల్యంతో నడవలేని స్థితిలో ఉన్న తనకు ఎలక్ట్రికల్ ద్విచక్రవాహనం మంజూరు చేసి ఆదుకోవాలంటూ చోడవరం మండలం వెంకన్నపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు ముచ్చల శ్రీను కలెక్టర్‌కు మొరపెట్టుకున్నాడు. చేతికర్ర, మూడు చక్రాల సైకిల్ బండితో తిరుగుతున్నప్పటికి తీవ్ర శ్రమ పడాల్సి వస్తుందని, కలెక్టరమ్మ స్పందించి ఎలక్ట్రికల్ బండి అందించాలని కోరాడు.

ఎస్పీ కార్యాలయానికి 31 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయానికి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 31 అర్జీదారులు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను సావధానంగా తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ భూ తగాదాలు - 16, కుటుంబ కలహాలు - 03, మోసాలకు సంబంధించినవి - 03, ఇతర విభాగాలకు చెందినవి - 09 అర్జీలు స్వీకరించినట్లు ఆయన చెప్పారు. చట్టపరిధిలో సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ భూఅక్రమాలపై విచారణకు డిమాండ్

ఆర్డీవో కార్యాలయం వద్ద గిరిజనుల ఆందోళన



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆదివాసీ సంఘం నాయకులు జనార్దన్, రాజు



ఆర్డీవో కార్యాలయం మెయిన్‌రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

నర్సీపట్నం: గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్పడిన భూ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏపీ ఆదివాసీ సంఘం, ఆదివాసీ సంఘర్ష మోర్చా నాయకులు కె.జనార్దన్, మోసూరి రాజు డిమాండ్ చేశారు. తహసీల్దార్ అక్రమాలపై స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. తహసీల్దార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్డీవో వి.వి.రమణకు వినతిపత్రం అందజేసి, భూరికార్డులు మార్చేసిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకొని గిరిజనుల సాగు భములను కాపాడాలని కోరారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ పాత మల్లంపేట ఆర్వోఆర్ రికార్డు మొత్తాన్ని ఆర్డీవో స్వాధీనంలో ఉంచాలన్నారు. గడబపాలెంలో 36 ఎకరాలకు ఆన్‌లైన్ రికార్డు మార్చేశారన్నారు. ఈ భూములు సాగు చేస్తున్న ఆదివాసీలకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదన్నారు. బుడ్డడపాలు గ్రామంలో 26 ఎకరాల భూమిలో కొండదొర ఆదివాసీలు సాగులో ఉండగా, రంగారెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తి సాగులో ఉన్నట్లుగా దొంగ పంచనామా నివేదిక తయారు చేయించారన్నారు. రెవెన్యూ విజిలెన్స్ విభాగం, ఎస్టీ కమిషన్‌తో సమగ్ర విచారణ జరిపించి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

100 కేజీల గంజాయి పట్టివేత

- ఏడుగురు నిందితుల అరెస్టు
- రెండు కార్లు, ఒక వ్యాను సీజ్

కోటవురట్ల: మండలంలోని యండపల్లి వద్ద వంద కేజీల గంజాయి పట్టుబడింది. ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. రెండు కార్లు, ఒక వ్యానును సీజ్ చేశారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించిన వివరాలు ప్రకారం... యండపల్లిలో ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు చేపట్టగా, రెండు కార్లలో నుంచి వ్యాన్‌లోకి గంజాయిని మారుస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.10 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. అల్లూరి జిల్లాకు చెందిన ఎ1 నిందితుడు బిసోయ్ బాలరాజు, ఎ2 తారాడ లింగంనాయుడు, ఎ4 పాంగి అశోక్‌కుమార్ కలిసి గతంలో గంజాయి వ్యాపారం చేసేవారు. ఎ1పై 2018లో పెందుర్తి పోలీసు స్టేషన్‌లోను, ఎ2పై 2013లో త్రిటౌన్ పోలీసు స్టేషన్‌లోను, ఎ4పై 2018లో పెందుర్తి, గోపాలపట్నం పోలీసు స్టేషన్లలోను గంజాయి కేసులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎ8 నిందితుడు ఎ1, ఎ2లకు ఫోన్ చేసి గంజాయి పంపాలని కోరాడు. వారు నాలుగు మూటలుగా కట్టి రెండు కార్లలో ఎ3 నిందితుడు గొల్లోరి అనిల్‌కుమార్, ఎ5 కొర్రా శామ్యూల్‌లతో యండపల్లి వరకు పంపించి వ్యాన్‌లోకి ఎక్కిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అల్లూరి జిల్లాకు చెందిన ఐదుగురు నిందితులతోపాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎ6 అజయ్, ఎ7 రాహుల్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వీరిని పట్టుకోవడంలో నక్కపల్లి సీఐ రామకృష్ణ సారథ్యంలో ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ గంగరాజు, హెచ్‌సీ చంద్రశేఖర్, పోలీసులు బి.కృష్ణ, ఆర్.వరం, హోంగార్డులు కె.మచ్చన్న, ఎల్.రమేష్, పి.సత్యనారాయణ ప్రతిభ చూపారని డీఎస్పీ ప్రశంసించారు.

బుచ్చెయ్యపేటలో భారీ వర్షం

నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు



వడ్డాది డైవర్షన్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

బుచ్చెయ్యపేట: మండలంలో సోమవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి జోరు వర్షం కురిసింది. పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు పడ్డాయి. వీటి శబ్దానికి పొలాల్లో రైతులు ప్రాణభయంతో సురక్షిత ప్రాంతాలకు, ఇళ్లకు చేరుకున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో ఇళ్ల ముందు వరద నీరు పోటెత్తడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. బీఎస్, ఆర్టీ, పెదమదీన, పెదపూడి తదితర గ్రామాల రోడ్లు గోతుల్లో వర్షం నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బురదలో పలు వాహనాలు కూరుకుపోయాయి. వడ్డాది పెద్దేరు డైవర్షన్ రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. బంగారుమెట్ట బీఎస్ రోడ్డులో చేరిన వరద నీటిని మాడుగుల ఆర్అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్ పరిశీలించారు. వరద నీరు బయటకు పోయేలా మదుంలు ఏర్పాటు చేయాలని నాయకులు, ప్రజలు కోరారు. ఈ వర్షంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

రాజాంలో చెరువు గండి పడి రాకపోకలకు అవస్థలు

బుచ్చెయ్యపేట మండలం రాజాంలో అప్పలనాయుడు చెరువుకు గండి పడి రాకపోకలకు అంతరాయం కలిగింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి ఈ చెరువు పూర్తిగా నిండింది. సోమవారం కురిసిన వర్షానికి చెరువుకు గండి పడి రాజాం-తట్టబంద(ఆర్టీ) రోడ్డుపై వరద నీరు పొంగిపొర్లింది. చెరువు నుంచి రాజాం చెరుకు కాటా మూడు రోడ్ల జంక్షన్ వరకు కిలోమీటరు దూరం వరకు వరద నీరు ప్రవహించింది. ఈ రహదారిలో రాకపోకలు సాగించే అనకాపల్లి నుంచి బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు తిరిగే ఆర్టీసీ బస్సులతోపాటు పలు గ్రామాల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీ రోడ్డులోని గోతుల్లో ద్విచక్ర వాహనదారులు పడిపోయి ఇద్దరి సెల్ ఫోన్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి.



బుచ్చెయ్యపేట రోడ్డులో కురుస్తున్న వర్షం



ఆర్టీ రోడ్డులో చేరిన వరద నీరు



బంగారుమెట్టలో ఇళ్ల ముందు చేరిన వర్షం నీరు

అచ్చెన్న చెరువుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అచ్యుతాపురం రూరల్: యర్రవరం గ్రామానికి చెందిన అచ్చెన్న చెరువులో అక్రమ మట్టి తవ్వకాలపై కర్రి సాయి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. సర్వే నెం.147తో పాటు 148-1బిలో ఎ.5.80 సెంట్లు (ఎల్.పి.నెం .1603), 149-1సిలో ఎ.7.20 సెంట్లు (ఎల్.పి.నెం.1866)లో చెరువు మట్టి, గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికీ చెరువులో 2 పొక్లెయిన్‌లు ఉన్నాయని, అవకాశం దొరికినప్పుడల్లా చెరువు మట్టిని దోచేస్తున్నారన్నారు. స్థానికంగా ఉన్న కొందరు కూటమి నాయకులే అక్రమంగా ప్రభుత్వ చెరువు మట్టి తరలింపునకు సహకరిస్తున్నారన్నారు. సుమారు 200 కుటుంబాలు అచ్చెన్న చెరువుపై ఆధారపడి ప్రతి సంవత్సరం జాతీయ ఉపాధి హామీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అక్రమ మట్టి తరలింపుపై స్థానిక తహసీల్దార్‌కి గ్రామస్తులు పలుమార్లు విన్నవించినప్పటికీ ఫలితంలేకపోయిందని తెలిపారు.

క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత చంద్రకాంత్, అమృత దంపతులకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్ సునీల్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి అనకాపల్లికి చెందిన సున్నం చంద్రకాంత్, అమృత దంపతులు రూ.లక్ష 111 విరాళాన్ని సోమవారం అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో అందజేశారు. దేవస్థానం తరఫున ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సునీల్ బాండ్ ఇచ్చారు. ఆలయ అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంలను అందించారు.

వేంకటేశ్వరస్వామి హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి దేవాలయం హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం జరిగింది. 52 రోజులకు సంబంధించి స్వామివారి హుండీ ఆదాయం రూ.3,58,978, నాలుగు కేజీల 580 గ్రాముల వెండి, 9 గ్రాముల బంగారం, యూఎస్‌ఏ 20 డాలర్ ఒక నోటు వచ్చినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి బి.మురళీకృష్ణ తెలిపారు. స్వామివారి ఆదాయాన్ని దేవదాయ శాఖ బ్యాంక్ ఖాతాలో జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై డ్రోన్‌తో నిఘా



తాటిపర్తి చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి: డివిజన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టామని డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. అనకాపల్లి పోలీస్ డివిజన్ పరిధిలో తాటిపర్తి పోలీస్ చెక్‌పోస్టును సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. చెక్‌పోస్టులు ద్వారా ఎప్పటికప్పుడు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడైనా గంజాయి రవాణా చేస్తున్నట్లు ఆయా ప్రాంతాల వ్యక్తులకు తెలిసినట్లయితే దగ్గరలో పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉన్నత స్థాయి

కశింకోట: విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి కృషి చేయాలని విశాఖపట్నం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మహిళా దంత కౌన్సిల్ డాక్టర్ అనుపమ భరతం, డాక్టర్ కె. శిరీష తెలిపారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూలులో విశాఖపట్నం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, క్యాన్సర్‌పై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆయా అంశాలపై అవగాహన కలిగించారు. స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, ప్రిన్సిపాల్ రూపనంది, సిబ్బంది పాల్గొన్నారు.

225 మందికి వైద్య సేవలు



ఉప్పునీటి దిబ్బ వద్ద వైద్య శిబిరంలో రోగులు

కశింకోట: స్థానిక ఉప్పునీటి దిబ్బ వద్ద స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద 225 మందికి సేవలందించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. క్యాన్సర్, టీబీ వంటి వ్యాధులకు పరీక్షలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఆర్‌ఈసీఎస్ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు శిబిరాన్ని సందర్శించారు. ఉగ్గినపాలెంలో తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు సుమ, మనీషాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

కుక్కల నియంత్రణ ఏదీ?

- మూతపడిన యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం
- విచ్చలవిడిగా శునకాల సంచారం
- బయటకు రావాలంటే ప్రజల బెంబేలు



పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న శునకాలు



సుంకరమెట్ట జంక్షన్ వద్ద మూతపడిన యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం

అనకాపల్లి టౌన్: ఇంట్లో నుంచి వీధిలోకి అడుగు పెట్టాలంటేనే పట్టణ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణం, మండలంలో ఎక్కడ పడితే అక్కడ కుక్కలు చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రజలపై దాడి చేస్తున్నాయి. వీటి సంతతిని నిరోధించడానికి ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం సిబ్బంది జీతాల లేమితో మూత పడింది. వీటిని అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం మానేశారు.

విద్యార్థులు జాగ్రత్త

దసరా సెలవుల నేపథ్యంలో పట్టణం, గ్రామాల్లో ఎక్కువగా రోడ్లపైనే విద్యార్థులు ఆటలాడుకుంటారు. ఆ సమయంలో తెలిసీ తెలియని వయసులో కుక్కలను కొట్టే ప్రయత్నం కూడా చేస్తుంటారు. దీంతో అవి చిన్నారులపై విచక్షణా రాహిత్యంగా దాడి చేసే ప్రమాదముంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను బయటకు పంపించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటే కుక్కల దాడి నుంచి తప్పించుకునే అవకాశముంది.

ఇటీవల కుక్కల దాడి..

మళ్లవీధిలో ఒక మహిళపై కుక్క దాడి చేసి ముఖంపై తీవ్రంగా గాయపరిచింది. వెనువెంటనే కుక్క కూడా చనిపోయింది. ఇటీవల ఎన్టీఆర్ ఆస్పత్రికి దగ్గరలో ఒకే కుక్క 20 మందికి పైగా కరిచింది. దీని బారిన పిల్లలు, పెద్దలకు పడ్డారు. వారందరికి ఆస్పత్రిలో టీకాలు వేశారు. ఇలాంటి భయానక ఘటనలు అనకాపల్లిలో నెలకొన్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి కుక్కల నివారణకు తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మూతపడిన యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం....

పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్ వద్ద కుక్కలకు టీకాలు వేసి వాటి సంతతిని నిరోధించడానికి కేంద్రం ఏర్పాటు చేశారు. ఐదుగురు దినసరి కార్మికులను ఏర్పాటు చేశారు. వీరు కుక్కలను పట్టుకుని తెచ్చి కు.ని ఆపరేషన్లు చేసి మరలా విడిచిపెడతారు. ఆపరేషన్ చేయడం వల్ల కుక్కల సంతతి పెరగదు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ కేంద్రం పనితీరు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. సిబ్బందికి జీతాలు ఇచ్చుకోలేక వారం రోజులకే ఈ కేంద్రాన్ని నిర్వహించలేక జీవీఎంసీ అధికారులు మూసివేశారు.

ఈ ప్రాంతాల్లో అధికం..

పట్టణంలోని గవరపాలెం, వేల్పులవీధి, చిన్నవీధి, మళ్లవీధి, గాంధీనగరం, లక్ష్మీదేవి పేట, చినబాబు కాలనీ, తుమ్మపాల, మార్టూరు, వెంకుపాలెం, కొత్తూరు, శారదానగర్, పిసినికాడ, వేటజంగాలపాలెం తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇవి గుంపులు గుంపులుగా దాడి చేస్తున్నాయి. ఉదయాన్నే విద్యార్థులు, ఉద్యోగులు వ్యాపారులు తమ ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. వీటి నుంచి రోడ్డు ప్రమాదాల బారినపడుతున్నారు. రహదారుల పక్కన్న కూర్చున్న శునకాలు ఒక్కసారిగా వాహనాలకు అడ్డంగా రావడం, దాడి చేయడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. పెద్దవారు అదిలించి కుక్కల నుంచి తప్పించుకునే అవకాశమున్నా, చిన్నారులు వీటి బారిన ఎక్కువగా పడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



గతంలో కంటే ప్రస్తుతం కుక్కగాటు బాధితులు పెరుగుతున్నారు. ఎక్కువగా చిన్నారులను కరుస్తున్నాయి. ప్రాంతాల వారీగా ఈ సమస్యను ఉన్నతాధికారులకు పంపించాం. పెంపుడు కుక్కలతో పాటు, వీధి కుక్కలకు రేబిస్ సోకకుండా తప్పనిసరిగా ఏడాదికొకసారి విధిగా టీకాలు ఇప్పించాలి. కుక్కకాటుకు గురైనప్పుడు వెంటనే సబ్బుతో కరిచిన ప్రాంతంలో శుభ్రం చేసి, ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తీసుకురావాలి. గాటును బట్టి అవసరమైన ఇంజక్షన్లు వేస్తున్నాం.

– క్రిసోలైట్, యానిమల్ బైట్ క్లినిక్ ఇన్‌చార్జి, ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రి, అనకాపల్లి

కుక్కల నివారణకు తగిన చర్యలు



పట్టణంలో కుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. మూతబడిన ఏనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం తెరుచుకునేలా చర్యలు తీసుకుంటాం. విశాఖ నుంచి ప్రత్యేక సిబ్బందిని తెప్పించి ఎప్పటికప్పుడు కుక్కలను పట్టుకుంటున్నాం.

– చక్రవర్తి, కమిషనర్, జీవీఎంసీ అనకాపల్లి జోన్

పట్టణంలో కుక్కల బెడద

పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. జీవీఎంసీ అధికారులు వీటిని నియంత్రించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏ వీధిలో చూసినా కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయి. పిల్లలను బయటకు పంపాలంటే భయమేస్తుంది. తక్షణమే కుక్కలను అరికట్టాలి.

– హరి, అనకాపల్లి

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

అనకాపల్లి టౌన్: పట్టణంలో పలు ప్రాంతాల్లో మంగళవారం నుంచి ఈ నెల 26 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి తెలిపారు. గొల్లవీధి, భీమునిగుమ్మం, నర్సింగ్‌రావు పేట, మిర్యాలకాలనీ, శ్రీరామ్‌నగర్, గాంధీనగరం, వేల్పులవీధి, శతకంపట్టు, అరుంధతీ నగర్ ప్రాంతాల సచివాలయాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు.

ఉచితంగా ఆయుర్వేద మందుల పంపిణీ



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు లావణ్య

అనకాపల్లి: ఆయుర్వేదంలో దీర్ఘకాలిక వ్యాధులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని జిల్లా ఆయుష్మాన్ శాఖ అధికారి డాక్టర్ కె.లావణ్య, ఆర్‌డీడీ కె.శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ విలీనగ్రామం సిరసపల్లి యూపీహెచ్‌సీ ఆస్పత్రిలో సోమవారం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో ఆయుష్మాన్ శాఖ జిల్లా ఆస్పత్రి ఉందని, రోజుకు 80 మంది రోగులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఆయుర్వేద మందులు తీసుకుని వెళ్తున్నట్లు చెప్పారు. బీపీ, సుగర్, పక్షవాతం, కీళ్లనొప్పులు, నరాలు బలహీనత వంటి అనేక రకాల వ్యాధులకు ఆయుర్వేదంలో ఉచితంగా ప్రభుత్వం మందులు పంపిణీ చేస్తుందన్నారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన రోగులతో యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో ఆయుర్వేద ఫార్మసిస్ట్ సీహెచ్.గణేష్, యోగా శిక్షకురాలు ఎం.చంద్రిక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న బీజేపి నాయకులు

అనకాపల్లి టౌన్/కశింకోట: తగ్గిన జీఎస్టీతో ప్రతి ఒక్కరికీ మేలు కలుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరావు తెలిపారు. స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్‌లో నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిచారు. కార్యక్రమంలో బొడ్డేడ నాగేశ్వరావు, గొర్ల రామ్ నాయుడు, ఈశ్వర ప్రసాద్, ఏ నాయుడు తదితరులు పాల్గొన్నారు. సోమవారం రాత్రి కశింకోటలో ర్యాలీ నిర్వహించారు. నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

అభివృద్ధి బాటలో అన్నపూర్ణ బ్యాంక్



మాట్లాడుతున్న సత్యకుమార్



సమావేశానికి హాజరైన రైతులు

అనకాపల్లి: రైతుల సహకారంతో అన్నపూర్ణ బ్యాంక్ అభివృద్ధి బాటలో నడుస్తుందని బ్యాంక్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి వి.వి.వి.సత్యకుమార్ తెలిపారు. స్థానిక గాంధీనగరం అన్నపూర్ణ బ్యాంక్ (తుమ్మపాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)ఆవరణలో సోమవారం రైతులతో సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ బ్యాంక్‌ను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేశామన్నారు. రైతులకు షేరు ధనంపై 10శాతం డివిడెంట్ ఇస్తున్నామని, సకాలంలో రుణం చెల్లించిన సభ్యులు ఎవరైనా మృత్యువాత పడితే గతంలో దహన ఖర్చుల నిమిత్తం ఇస్తున్న రూ.6 వేల నుంచి రూ.8 వేలకు పెంచామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సంఘ సభ్య రైతులకు సకాలంలో ఎరువులు అందజేశామన్నారు. తీసుకున్న రుణాన్ని పూర్తిస్థాయిలో చెల్లించినట్లయితే రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ అవుతుందన్నారు. ఈ పద్ధతిని రద్దు చేసేందుకు రైతులు తీర్మానించారన్నారు. కార్యక్రమంలో రైతులు బొడ్డపాడి చిన్నరాజారావు, పీలా బుజ్జి, పీలా జగ్గసత్యనారాయణ, చదరం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్లలో అవకతవకలపై ఫిర్యాదు



డీఈవోకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

అనకాపల్లి టౌన్: సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ) డిప్యూటేషన్లలో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీవీ రమణ, నక్క శ్రీనుబాబు డిమాండ్ చేశారు. స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావు నాయుడుకు ఫిర్యాదు చేశారు. వయోపరిమితికి మించిన వారిని నియమించడం, పీజీ అర్హతలు లేని అభ్యర్థులను ఎంపిక చేయడం, నోటిఫికేషన్‌లో పేర్కొనని సహిత విద్య సమన్వయ కర్త వంటి కొత్త పోస్టులను భర్తీ చేయడం, జిల్లాలో పనిచేస్తున్న స్థానిక ఉపాధ్యాయులను నియమించాలనే నిబంధనలను ఉల్లంఘించడం, వంటి వాటిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు.

చోరీ కేసుల్లో నిందితుడు అరెస్టు

- 29.20 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం



మాట్లాడుతున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్

అనకాపల్లి టౌన్: పట్టణం, మండలంలోని చోరీలకు పాల్పడిన దొంగను అరెస్ట్ చేసి, రూ. 3 లక్షల విలువ చేసే 29.20 గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ విజయ్ కుమార్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం .. పరవాడ మండలం కన్నూరు గ్రామానికి చెందిన గేదెల రాజశేఖర్ పెయింటింగ్ పనులు చేసుకుంటూ చోరీలకు పాల్పడుతున్నాడు. మే నెలలో గాంధీనగరం ఇన్‌కమ్ ట్యాక్స్ వీధిలో కొమ్మోజు రాజేశ్వరి ఇంట్లో నాలుగున్నర తులాల చైను, రెండు జతల చెవిదిద్దులు, నాలుగు బంగారు గాజులు, పిసినికాడ గ్రామంలో మల్ల నూక అప్పారావు ఇంట్లో అరతులం బంగారం ఉంగరాన్ని దొంగిలించాడు. రెండిళ్లలోనూ తాళాలు విరగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. ఈ రెండు దొంగతనాలకు సంబంధించి ఒక బంగారు చైన్, రెండు జతల బంగారు చెవిదిద్దులు, ఒక బంగారు ఉంగరం, మొత్తం 26.43 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడి నుంచి స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



తాళ్లపాలెం కూడలిని పరిశీలిస్తున్న ఎంవీ ఇన్‌స్పెక్టర్ లీలాప్రసాద్, సీఐ స్వామినాయుడు

కశింకోట: మండలంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో తక్షణమే నివారణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లీలాప్రసాద్ తెలిపారు. రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా మండలంలోని జాతీయ రహదారిపై గుర్తించిన ఎక్కువ ప్రమాదాలు జరిగే కశింకోట, బయ్యవరం, తాళ్లపాలెం కూడలి, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం ప్రాంతాలను సీఐ అల్లు స్వామినాయుడు, జాతీయ రహదారి అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తరచుగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాల గురించి నిశితంగా పరిశీలించారు. ప్రత్యేకంగా ప్రమాదాలు జరుగుతున్న మలుపులు, స్పీడ్ బ్రేకర్లు, ప్రాంతాలు, లైటింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ సైన్ బోర్డులు, రోడ్డు విస్తరణ వంటి అంశాల గురించి సమీక్షించారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రమాదాలు నివారించడానికి తీసుకోవలసిన సత్వర చర్యల గురించి సంబంధిత శాఖలకు ఈ సందర్భంగా సూచనలు చేశారు. ప్రజలు కూడా రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

భవానీభక్తుల పాదయాత్ర



చింతలపాలెం చేరుకున్న శ్రీకాకుళం భవానీభక్తుల పాదయాత్ర

కశింకోట: చింతలపాలెంలో సోమవారం భవానీ భక్తులకు స్వాగతం పలికి స్థానికులు ఆతిథ్యం ఇచ్చారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రేగిడి గ్రామానికి చెందిన 11 మంది భవానీ భక్తులు ఐదోసారి కాలినడకన విజయవాడకు ఈ నెల 17న బయలుదేరారు. వీరు చింతలపాలెం చేరిన తర్వాత స్థానిక అమ్మవారి భక్తులు జెర్రిపోతుల నూకినాయుడు, సియాద్రి చిట్టిబాబు, కోన శేఖర్, తిర్రి నాగేష్, ఏసు సాదరంగా ఆహ్వానించారు. వారికి పండ్లు, ఫలహారం అందించి సాదరంగా సాగనంపారు.

కార్మికుల పని గంటల పెంపు దారుణం

ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు ధర్నా



జెడ్సీ చక్రవర్తికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అనకాపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దశలు వారీగా ప్రజల నడ్డివిరిచేందుకు చర్యలు చేపడుతుందని, అందులో భాగంగానే ఇటీవల కార్మికుల 12 గంటల పని విధానం పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో వద్ద సోమవారం ధర్నా నిర్వహించి, జెడ్సీ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో ప్రాణత్యాగాలు చేసి సాధించిన 8 గంటల పనిని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను రాత్రి షిఫ్ట్ డ్యూటీలు చేయాలని నిర్ణయాన్ని రద్దు చేయాలని, కార్మిక ఓట్లతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వారిని కట్టు బానిసలుగా చేయడం అన్యాయమన్నారు. అధికారం ఉందని ఇష్టం వచ్చినట్లు నిర్ణయాలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి అనకాపల్లి జోనల్‌లో పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులకు 12వ పీఆర్సీని తక్షణమే అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, గత జూలై సమ్మెకాలం జీతం వెంటనే చెల్లించాలని, ఎస్ఎంఆర్, బదిలీ కోవిడ్ కార్మికులకు రూ.21 వేలు, క్లాప్ డ్రైవర్లకు రూ.24,500 జీతం చెల్లించాలని, తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కాళ్ల తేలయ్యబాబు, బొమ్మల రాము, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు నిమ్మకాయల అజయ్, పొట్నూరి గోవిందు, ఎరశెట్టి ఓం నమశ్శివాయ, నూకరాజు, బొమ్మలు నాగరాజు, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం



కశింకోటలో బాలా త్రిపుర సుందరీదేవిగా కనకదుర్గ



గవరపాలెం సతకం పట్టు వద్ద స్వర్ణ కవచ దుర్గాదేవిగా ..



సత్యనారాయణపురం కనకదుర్గమ్మ సేవలో ఆలయ చైర్మన్ కోటిపల్లి కిషోర్ దంపతులు



గాయత్రీదేవిగా అలంకరణలో కన్యకాపరమేశ్వరి




కశింకోట శివాలయంలో బాలా త్రిపుర సుందరిగా సర్వమంగళాంబ



గౌరీపంచాయతన దేవాలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున దంపతులు

అనకాపల్లి/కశింకోట: వాడవాడలా దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఊరూవాడా దుర్గాదేవి నామస్మరణతో మార్మోగింది. ఎక్కడచూసినా భవానీ మాలధారులతో అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. నవరాత్రుల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

చలో విశాఖ డెయిరీ రేపు



చలో విశాఖ డెయిరీ ధర్నా పోస్టర్ల ఆవిష్కరణ

కశింకోట: పాడి రైతుల సమస్యల పరిష్కారానికి ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న తలపెట్టిన చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఎస్. బ్రహ్మాజీ కోరారు. బయ్యవరం, తేగాడ, గంటవానిపాలెం, కొత్తపల్లి, బుచ్చెయ్యపేట, తాళ్లపాలెం, పి. సోమవారం, నరసింగబిల్లి, ఏఎస్ పేట, పిసినికాడ గ్రామాల్లో సోమవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా పాడి రైతులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డెయిరీలో స్వార్థ ప్రయోజనాలతో రైతులను నష్టాల పాలు చేస్తున్నారని ఆరోపించారు. బహిరంగ మార్కెట్‌లో డెయిరీ ఉత్పత్తులకు ఎక్కువ ధరకు విక్రయించి పాడి రైతులకు మాత్రం తక్కువ ధరను చెల్లిస్తున్నారని వాపోయారు.

నాటికల ప్రదర్శన ప్రారంభం



నాటికలను ప్రారంభిస్తున్న వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ

అనకాపల్లి: గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ శరన్నవరాత్రులను పురస్కరించుకొని పార్కు సెంటర్ గౌరీ సేవా సంఘం హాల్‌లో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికలను అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ సోమవారం రాత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అనకాపల్లి నాటికలకు పుట్టినిల్లు అన్నారు. అనంతరం శ్రీరామ పాదుకా పట్టాభిషేకం నాటికను ప్రదర్శించారు. పిఠాపురం ఆస్థాన కవి కీర్తిశేషులు పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులు ఈ నాటకాన్ని రచించారు. ఖమ్మం జిల్లా మధిర సుమిత్ర యూత్ అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికకు డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు దర్శకత్వం వహించి దశరథుడు పాత్ర ధరించారు. శ్రీరాముడుగా చిలువేరు శాంతయ్య, దశరథుడుగా డాక్టర్ నిభాను పూడి సుబ్బరాజు, లక్ష్మణుడిగా కిశోర్, భరతుడుగా రమణ, సుమంతుడుగా సాంబశివ, వశిష్టుడిగా కోటి, కైకగా అమత వర్షిణి, సీతగా సురభి పూజిత నటించారు. హార్మోనియం ఉయ్యూరు నాగేశ్వరరావు సహకారం అందించారు.